క్లుప్తంగా

రాట ముహూర్తం



పందలపాకలో రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిక్కవోలు: శ్రీరామ నవమి పురస్కరించుకుని పందలపాకలోని వెలంపేట రామాలయం వద్ద శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణకర్తగా ఏలూరు జిల్లా పోలవరం మండలం రామయ్య పేట గ్రామానికి చెందిన పైల శ్రీహరి కృష్ణ, అరుణకుమారి దంపతులు వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో బొడ్డు ముత్యాలరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: మండలంలోని రంగాపురం, ఇలపల్లి, ఆర్ఎస్ పేట, ఊలపల్లి, బిక్కవోలులో రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. రంగాపురంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

సీతానగరం: మండల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలంలో పదకొండు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. చినకొండేపూడిలో కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభిస్తారన్నారు.

మే 21 నుంచి జాతీయ నాటక పోటీలు

బిక్కవోలు: మండలంలోని రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ ఆధ్వర్యంలో మే 21 నుంచి 24 వరకూ జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ తొమ్మిది నాటకాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశామన్నారు. విజేతలకు 24వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు.

చెత్త సేకరణపై పర్యవేక్షణ



బొబ్బిల్లంకలో చెత్తను సేకరణను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మూర్తి

సీతానగరం: ప్రజలు తమ ఇళ్ల నుంచి వచ్చే చెత్తను తడి, పొడిగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి సూచించారు. బొబ్బిల్లంక, చినకొండేపూడి పంచాయతీలలో శుక్రవారం ఆయన పర్యటించారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లపై ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు టి.శ్రీనివాస్, అరుణ్ మణి కుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంబాలచెరువు: క్వారీ ఏరియాలోని డీమార్ట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గాడాలకు చెందిన నూలు శ్రీరామచంద్రమూర్తి (72) మెయిన్ రోడ్డులోని బీఆర్కే వస్త్ర దుకాణంలో అకౌంటెంట్గా పనిచేస్తున్నాడు. ఉదయం డ్యూటీకి వస్తున్న సమయంలో డీమార్ట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఇసుక లారీ ఆయనను ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీరామచంద్రమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ వెబినార్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ వెబినార్ జరిగింది. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, సోషల్ వర్క్ విభాగాలు సంయుక్తంగా స్థితిస్థాపక కథల శక్తి, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్ నుంచి అంతరాష్ట్రులు అనే అంశంపై ఈ వెబినార్ను నిర్వహించాయి. దీనిలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని, విపత్తు స్థితిస్థాపకత, కమ్యూనిటీ సాధికారతపై అట్టడుగు స్థాయి కథల ప్రభావాన్ని చర్చించారు. కెనడాలోని థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్, నేపాల్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాలరాజు నిక్కు ముఖ్య అతిథిగా హాజరై కీలక ఉపన్యాసం అందించారు. భారతదేశం, నేపాల్, మలేషియా, కెనడాలో తన అనుభవాలను పంచుకున్నారు. కొల్లేరు (ఏలూరు) ఫీల్డ్ క్యాంప్ నుంచి వెలువడిన ముఖ్యమైన పరిశోధన ఫలితాలను వెల్లడించారు. థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం బ్లాగ్, గ్లోబల్ నెట్వర్క్ ఫోటో వీక్ కార్యక్రమాల్లో విద్యార్థులు తమ రచనలను ప్రచురించే అవకాశాన్ని ఆయన ప్రకటించారు. ఈ వెబినార్ను సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సీతామహాలక్ష్మి కస్తూరి ప్రారంభించారు.

అరుణోదయం



శిక్షణా కార్యక్రమానికి హాజరైన మహిళలు

- డ్వాక్రా మహిళలకు వ్యక్తిగత రుణాలు
- మంజూరు చేయనున్న బ్యాంకులు
- సొంత అవసరాలు తీర్చుకునే అవకాశం

రాజానగరం: డ్వాక్రా సంఘాల అభివృద్ధికి బ్యాంకులు మంజూరు చేసే రుణాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. మహిళలే సభ్యులుగా ఉండే ఈ సంఘాలకు ప్రారంభంలో రూ.10 వేలు చొప్పున రుణం మంజూరు చేసిన బ్యాంకులు నేడు రూ.లక్షలలో అందిస్తున్నాయి. సాధారణంగా వివిధ అవసరాల కోసం పురుషులు తీసుకునే రుణాల కంటే రికవరీ రేటు మహిళలకే ఎక్కువ ఉండడంతో ఈ సంఘాలకు రుణాలు ఇచ్చే విషయమై బ్యాంకులు ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు.

వ్యక్తిగత రుణాలు

ఈ క్రమంలో ఇప్పటి వరకు సంఘాల పరంగానే మంజూరు చేసిన రుణాలను ఇక నుంచి ఆయా సంఘాల సభ్యులకు వ్యక్తిగతంగా కూడా మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. వ్యక్తిగత అవసరాలు, వ్యాపారాల కోసం ఆయా సంఘాల తీర్మానం మేరకు బ్యాంకులు లింకేజీ రుణాలను మంజూరు చేస్తాయి. పొదుపు సంఘాలలోని సభ్యులకు వ్యక్తిగత రుణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు స్త్రీ నిధి, ఉన్నతి, వీఆర్ఎఫ్లలో ఇచ్చే రుణాన్ని రూ.75 వేలకు కూడా పెంచారు. ఇతర వర్గాలకు వారు చేసిన పొదుపును పరిగణనలోకి తీసుకుని రూ.ఒక లక్ష పైబడి (రుణ అవసరాన్ని పరిగణలోకి తీసుకుంటారు) మంజూరు చేసేలా తాజాగా మార్పులు చేశారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వ్యవసాయం, వ్యాపారాల మున్నగు వాటి కోసం మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. అయితే వ్యక్తిగత రుణాలను 24 నెలల వ్యవధిలోనే తిరిగి చెల్లించేలా స్వయం సహాయక సంఘాలలో బైలా రూపొందించారు.

గ్రామైక్య సంఘం గుర్తిస్తుంది

గ్రామాలలో ఉన్న పొదుపు సంఘాలలో ఉండే సభ్యులకు ఏ నెలలో ఎంతమందికి రుణాలు అవసరమో ఆ గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘం గుర్తించి, సంబంధిత అధికారుల ద్వారా బ్యాంకు లింకేజీకి పంపించాలి. ఆ విధంగా తీసుకున్న రుణాన్ని నిర్ణీత గడువుకు ముందే చెల్లించిన వారికి ప్రత్యేక రాయితీ కూడా ఇస్తారు. రాజానగరం నియోజకవర్గంలో 6,566 పొదుపు సంఘాలు, 193 గ్రామైక్య సంఘాలు, అనపర్తి నియోజకవర్గంలో 4,893 పొదుపు సంఘాలు, 138 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధికి..



వ్యక్తిగత రుణాలు తీసుకున్న సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి గ్రామైక్య సంఘాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహకారం అందిస్తోంది. సరైన కార్యాచరణ ఉంటేనే తీసుకున్న రుణం ద్వారా మంచి ఫలితాలను అందుకోగలుగుతారు.

– ఎన్వీవీఎస్ఎన్ మూర్తి, డీఆర్డీఏ, పీడీ

ఎన్నికల హామీలను అమలు చేయాలి



రాజానగరంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీలు

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత గ్రామంలోని అన్నదాన సత్రం నుంచి ప్రదర్శనను ప్రారంభించి, గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్, పోలీసు స్టేషన్, సాయిబాబా మందిరం మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు అన్ని రకాల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, కడియాల దుర్గారావు, టేకుమూడి రామకృష్ణ, షేక్ బేబీ పాల్గొన్నారు.

52 యూనిట్లకు 2023 అభ్యర్థులు

రాజానగరం: స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఈబీసీలకు మంజూరు చేసే రుణాల కోసం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మంజూరైన యూనిట్లు 52 అయితే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని, ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు 2,023 మంది కావడంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఎంపీడీఓ జేవీ ఝాన్సీతో పాటు మండల పరిధిలోని 14 బ్యాంకు శాఖలకు చెందిన అధికారులు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. యూనిట్ విలువను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రవికుమార్

పెదపూడి: తడి, పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్మిత్రలకు అందజేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ అన్నారు. కరకుదురులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మహిళలు, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేర్వేరుగా సంపద తయారీ కేంద్రానికి తరలిస్తే, అక్కడ తడి చెత్తతో సహజ పోషకాలు కలిగిన ఎరువు తయారు చేస్తారన్నారు. పొడి చెత్తను రీసైకిల్ చేసి విక్రయిస్తారన్నారు. తద్వారా వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ వుండ్రు చంద్రకళ, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, సచివాలయం కార్యదర్శి బి.ప్రసన్న ఆంజనేయులు, స్థానిక సాగునీటి సంఘం అధ్యక్షుడు తోటకూర వెంకట్రావు, మాజీ సర్పంచ్ సింగినీడి నాగతిరుపతిరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిర్రా వరప్రసాద్, పాటంశెట్టి కాశీ రాణి పాల్గొన్నారు.

జాతీయ సెమినార్లో ఉపాధ్యాయిని ప్రతిభ



ఉపాధ్యాయిని రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: జాతీయ స్థాయి సెమినార్లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ విశేష ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి శుక్రవారం విలేకరులకు తెలిపారు. అడాల్సెంట్ ఎడ్యుకేషన్ ఫర్ వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశంతో ఎన్సీఈఆర్టీ నిర్వహించిన జాతీయ సెమినార్లో జీరో హంగర్ విత్ మైటీ మిల్లెట్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని రమ్యసుధ సమర్పించారన్నారు. అలాగే ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ ఇన్ ఎడ్యుకేషన్ ఏజ్ కన్సర్న్ టూ ఎన్ఈపీ –2020 అనే ముఖ్య ఉద్దేశంతో భారతీయ శిక్షా మండల్ మహారాష్ట్ర నిర్వహించిన జాతీయ సెమినార్లో హీలింగ్ త్రూ హెరిటేజ్ ది సైన్స్ ఆఫ్ వేదిక్ ఫుడ్ హేబిట్స్ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని కూడా అందజేశారన్నారు. ఈ రెండు సెమినార్లలో దేశ వ్యాప్తంగా 400 మందికి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించగా అందులో 60 మాత్రమే ఉత్తమమైనవిగా గుర్తించారన్నారు. వీటిలో రమ్యసుధ అందజేసిన రెండు పరిశోధనా పత్రాలు ఉండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రమ్యసుధను పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



వృద్ధుడిని 108లో ఆస్పత్రికి తీసుకువెళుతున్న ఎస్సై శ్రీను నాయక్, సిబ్బంది

పెదపూడి: అనారోగ్య సమస్యతో ఓ వృద్ధుడు కాలువలోకి దిగి ఆత్మహత్యకు యత్నించాడు. అనపర్తి ఎస్సై శ్రీను నాయక్, సిబ్బంది సకాలంలో స్పందించి అతడిని కాపాడారు. వివరాల్లోకి వెళితే.. అనపర్తికి చెందిన సత్తి రామారెడ్డి అనే వృద్ధుడు అనారోగ్య సమస్యలు తట్టుకోలేక శుక్రవారం ఆ గ్రామంలోని ధరణికోట శివాలయం వద్ద ఎర్రకాలులో దిగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడు కాలువలో తేలుతూ, మునుగుతూ కొట్టుకుపోతుండగా కెనాల్ రోడ్డుపై వెళుతున్న కొందరు స్పందించి 100కు కాల్ చేశారన్నారు. ఆ కాల్ సెంటర్ నుంచి అనపర్తి పోలీస్ స్టేషన్కు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై శ్రీను నాయక్, రైటర్ శంకర్ హుటాహుటీన కాలువ వద్దకు వెళ్లారు. అక్కడ ఇటుకల బట్టీలో పనిచేస్తున్న కార్మికుల సాయంతో వృద్ధుడిని బయటకు తీసి రక్షించారు. అనంతరం 108లో ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వృద్ధుడికి రక్షించిన ఎస్సై శ్రీను నాయక్, రైటర్ శంకర్, ఇటుకల బట్టి కార్మికులను పలువురు అభినందించారు.

కూటమి కుట్రలను సమష్టిగా ఎదుర్కొందాం

- కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి సైనికులు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాపవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: ప్రజలను వంచించి గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం కుట్రలను తిప్పికొడుతూ, ప్రజల పక్షాన సమష్టిగా పోరాడదామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. నా కార్యకర్తలు – నా కుటుంబం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరుకొండ మండలం కాపవరంలో పార్టీ మండలాధ్యక్షుడు అడపా కనకరాజు నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు జరపకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటమి సహజమన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలని, వారికి పార్టీ ప్రత్యేక గౌరవం ఇస్తుందన్నారు. కూటమి పాలనపై ప్రజలు విసిగిపోయారని, వైఎస్సార్ సీపీ వారి కోసం నిర్వహించే పోరాటాల్లో కీలక పాత్రను పోషిస్తారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలపై అలుపెరగని పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు అడపా కనకరాజు, పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం



శ్రీరంగపట్నంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రొఫెసర్

కోరుకొండ: వ్యవసాయ విద్యార్థులు చదువులో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో శుక్రవారం రాజమహేంద్రవరానికి చెందిన వ్యవసాయ కాలేజీ విద్యార్థులు ఆర్ఏడబ్ల్యూఈపీ (రావెప్)లో భాగంగా జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలిరోజు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సునీత, కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ దక్షిణామూర్తి, గ్రామ నాయకులు మద్దాల రమణ, పంచాయతీ సెక్రటరీ షేక్ మదార్ బీబీ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాకాళేశ్వరాలయ

తృతీయ వార్షికోత్సవం



మహాకాళేశ్వరాలయం



మహాకాళేశ్వరుడు

ఆల్కాట్తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో వేంచేసియున్న మహాకాళేశ్వరాలయం తృతీయ వార్షికోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8.00 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, గోపూజ,యాగశాల ప్రారంభ ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధనలు జరుగుతాయి. సాయంత్రం బిల్వార్చన అష్టోత్తర శత కలశావాహన, మండప దేవత హోమాలు, ప్రాయశ్చిత్త హోమాలు, నీరాజన మంత్రపుష్పము వేదస్వస్తి నిర్వహిస్తారు. ఆదివారం విఘ్నేశ్వరపూజ, సీతారాముల కల్యాణం, ప్రాంగణ పరివేష్టిత దేవత మూల మంత్ర హోమాలు, నీరాజనం మంత్రపుష్పాలు, వేదస్వస్తి జరుగుతుంది. సోమవారం ఉదయం 8.00గంటల నుంచి మండపార్చనలు, హోమాలు, అష్టోత్తర కలశాభిషేకం, శనిభగవానుడి శిఖర యంత్రస్థాపన, మహాకాళేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం, మహాపూర్ణాహుతి, శివ కల్యాణము, నీరాజన,ం మంత్రపుష్పాలు, దీక్షాదంపతులకు ఆశీర్వచనం ఉంటాయి. కార్యక్రమాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని భక్తులందరూ పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని రాజమహేంద్రవరం రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పట్టపగలు వెంకటరావు కోరారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి



బాలాజీపేట సెంటర్లో మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బాలాజీపేట సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి కేక్ కట్ చేసి, అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 200 మందికి బిర్యానీ ప్యాకెట్లు అందించారు. జక్కంపూడి గణేష్ ఫాలోవర్స్ కేపీ నాయుడు, రాజేష్, సుధా, ఆవాల ఈశ్వర్, రాంకీ, ఓం ప్రకాష్, టింకు, అప్పా నాని, ముద్దాల అను, సూరంపూడి గోపి, రెడ్డి ప్రసాద్, మురళీ, అహ్మద్ పాల్గొన్నారు.

రూత్ ఓల్డేజ్ హోమ్లో..

బొమ్మూరు మురళీకొండపై గల రూత్ ఓల్డేజ్ హోమ్లో జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సత్తార్, షేక్ సమీరా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గొందేశి శ్రీనివాసులురెడ్డి హాజరై, వృద్ధులకు అన్నవితరణ చేశారు.

చిత్రకళా ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు రోడ్డులో శుక్రవారం ఉదయం సాయంత్రం 5 గంటల వరకూ అమరావతి చిత్రకళ వీధి ప్రదర్శన జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు ప్రముఖులు, విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.



చిత్రకళాప్రదర్శనలో వేషధారణలు



సీఆర్పీఎఫ్ జవాన్ వేసిన చిత్రాలు





ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

కంబాలచెరువు: ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతికి కారకుడైన దీపక్ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్రాలు విఫలం చెందుతున్నాయన్నారు. వీటిని అరికట్టే దిశగా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉండి ఈ ఘటనపై స్పందించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. పోలీసులు కనీసం సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఎందుకు విచారణ జరిపించలేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన దీపక్ను శిక్షించాలన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలోనే జిల్లా వ్యాప్తంగా మహిళలపై అనేక అఘాయిత్యాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.